క్లుప్తంగా

వైభవంగా హుస్సేన్ వల్లి ఉరుసు ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామంలో వెలసిన శ్రీ హజరత్ హుస్సేన్ వల్లి ఉరుసు, శ్రీనారాయణస్వామి ఆరాధన ఉత్సవాలు శనివారం దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి పూజలు, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కోలాటం అకట్టుకుంది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ అవరణలో బండ లాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు.

నేడు రక్తదాన శిబిరం

కమలాపురం : అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మదర్ థెరిసా సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ట్రస్ట్ అధ్యక్షుడు జుటూరు విజయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సహజంగా వేసవి కాలంలో రక్త నిల్వలు తక్కువగా ఉంటాయని, అలాగే పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. యువకులు, ఉత్సాహ వంతులు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆయన కోరారు. అలాగే ఉద్యోగులు, వ్యాపారులు, యువతీ యువకులు, సేవా ప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మానవతా సంస్థకు బాడీ ఫ్రీజర్ వితరణ



బాడీ ఫ్రీజర్‌ను అందజేస్తున్న దాతలు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరుకు చెందిన ముసలయ్యగారి ఓబుల్‌రెడ్డి సంస్మరణగా ఆయన కుమార్తెలు ఓబులమ్మ, సౌజన్యలు బాడీ ఫ్రీజర్‌ను మానవత సేవా సంస్థకు అందజేశారు. చెన్నూరు గ్రామానికి చెందిన రెడ్డి రమణమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు సుబ్బరాయుడు, శ్రీనివాసులు, చిన్న(ఆర్ఎస్ఆర్ బ్రిక్స్) తన తల్లి జ్ఞాపకార్థం నవతా సేవా సంస్థకు బాడీ ఫ్రీజర్‌ను అందజేశారు. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నరేష్‌కుమార్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న జెడ్పీటీసీ తమ్మిశెట్టి బాలయ్య

ఎర్రగుంట్ల : చిలంకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరేష్‌కుమార్‌కు మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య శనివారం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. అతనికి సంబంధించిన చికెన్ సెంటర్‌కు కొందరు దుండగులు నిప్పంటించారన్నారు. కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు.

రేపటి నుంచి పదవ తరగతి పరీక్షలు

లింగాల : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి నిర్వహించనున్నారు. ఈ పరీక్షలలో బోనాల పాఠశాలకు చెందిన 20 మంది, లింగాల పాఠశాలకు చెందిన 45, కోమన్నూతల పాఠశాలకు చెందిన 35, పార్నపల్లె పాఠశాలకు చెందిన 56 మంది, వెలిదండ్ల పాఠశాలకు 29 మంది, పెద్దకుడాల పాఠశాలకు చెందిన 31మంది మొత్తం 215 మంది విద్యార్థులు లింగాల పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలకు తొండూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఫిజికల్ సైన్స్ టీచర్ కృష్ణారెడ్డి చీఫ్‌గా వ్యవహరిస్తారని, గురిజాల పాఠశాలకు చెందిన హెచ్ఎం భాస్కర్‌రెడ్డి డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని ఎంఈఓ-2 రామకృష్ణయ్య తెలిపారు.

విద్యార్థులకు పెన్నుల వితరణ



విద్యార్థులకు పెన్నులను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు నాయకులు

పులివెందుల : పట్టణంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం సాయి చైతన్య విద్యాసంస్థల కరస్పాండెంట్ నారాయణరెడ్డి సహకారంతో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు వి.రామ్ లక్ష్మణ్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా కోశాధికారి రాఘవేంద్రారెడ్డిలు పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు బాగా చదివి పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు నియోజకవర్గ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో 'స్పందన'కు చెల్లు చీటీ

- మండల, జిల్లా కేంద్రాలకు పరుగులు తీస్తున్న అర్జీదారులు
- ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

సింహాద్రిపురం : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సుపరిపాలన అందించాలన్న లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి 2 వేల కుటుంబాలకు ఒక గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం అమలు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు పంచాయతీ కార్యదర్శితోపాటు సచివాలయ అధికారులందరూ స్పందనకు హాజరయ్యేవారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా స్థానికంగా రోజూ గంటపాటు నిర్వహించి ప్రజల నుంచి సమస్యల వినతి పత్రాలు స్వీకరించేవారు. దీంతో జిల్లా, మండలస్థాయిలలో నిర్వహించే స్పందనకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది.



బలపనూరు గ్రామంలోని గ్రామ సచివాలయం

కూటమి ప్రభుత్వం వచ్చాక

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్పందన కార్యక్రమానికి స్వస్తి పలికింది. దీనికి పేరు మార్చి మండలస్థాయిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తుండటంతో ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. ప్రజలు గ్రామాల నుంచి మండల కేంద్రానికి, మండల కేంద్రంలో సరైన స్పందన లేకపోతే జిల్లా కలెక్టరేట్‌కు అవస్థల నడుమ పరుగులు తీసి తమ సమస్యలు నివేదించుకోవాల్సి వస్తోంది.

తిష్ట వేస్తున్న సమస్యలు

గ్రామాల్లోని సమస్యలను అధికారులకు నివేదించేందుకు మండల కేంద్రానికి వెళ్లాల్సి రావడంతో చాలా మంది సమస్యలను చెప్పుకోలేకపోతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు తిష్ట వేస్తున్నాయి. ప్రధానంగా భూ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వ పాలనలో మండల కేంద్రంలోనే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తుండటంతో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు వెళ్లలేకపోతున్నారు.

మహిళలు, వృద్ధులకు చాలా కష్టం



మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి దూర ప్రాంతాల నుంచి రావాలంటే మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. రానుపోనూ బస్సు ఛార్జీలు పెట్టుకోవాల్సి వస్తోంది. ప్రజలకు ఇబ్బంది కలగకుండా గ్రామస్థాయిలోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుంది.

– సాంబశివారెడ్డి, స్థానికుడు, సింహాద్రిపురం

'స్పందన' కొనసాగించాలి



ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే సచివాలయాల్లోనూ స్పందన (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) కార్యక్రమం నిర్వహించాలి. ఈ కార్యక్రమాన్ని నీరుగార్చకుండా అధికారులు గ్రామస్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునేలా సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలి.

– పవన్, స్థానికుడు, సింహాద్రిపురం

మెడికల్ కళాశాలను అందుబాటులోకి తీసుకురావాలి

పులివెందుల టౌన్ : టీడీపీ నాయకులు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి శనివారం మెడికల్ కాలేజీ వద్ద ఒక చిన్న బస్‌స్టాప్‌ను చాలా ఆడంబరంగా ప్రారంభించి ఏదో మహా కార్యం చేసినట్లు గొప్పలు ప్రదర్శించడం చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పులివెందులలో మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఒక వైపు దాదాపు రూ.600 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మెడికల్ కళాశాలలో జాతీయ వైద్య విద్యా మండలి అనుమతులు మంజూరు చేశారని, ఎక్కడ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందోనని మంజూరైన సీట్లను కూడా దుర్బుద్ధితో ఈ కూటమి ప్రభుత్వం రద్దు చేసి ఈ పులివెందుల ప్రాంత ప్రజలకు తీరని ద్రోహం చేసిందన్నారు. రాబోయే విద్యా సంవత్సరానికైనా ఈ కళాశాలలో తరగతులు ప్రారంభమయ్యేలా, ప్రభుత్వమే తరగతులు నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో కరువు ప్రాంత విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కనీసం శాసనమండలి కూడా తన వాణి వినిపించకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ బస్టాప్‌లను ప్రారంభించి చేతులు దులుపుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వం వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని, లేకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులను, యువతను, ప్రజలను కలుపుకుని నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వ తీరును ఎండగడతామన్నారు.

ఆశ్రమాన్ని కూల్చడం చాలా బాధాకరం

పులివెందుల : కాశిరెడ్డి నాయన ఆశ్రమ సత్రాలను కూల్చడం బాధాకరమని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఆర్‌సీడీఎస్ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, సభ్యులు కలిసి కూటమి ప్రభుత్వం వచ్చిన 9 నెలల్లోనే కాశినాయన క్షేత్రంలో కూల్చివేతల పేరుతో వినాశనం చేస్తున్నారన్నారు. దీనిపై స్పందించి కేంద్ర మంత్రులతో మాట్లాడి న్యాయం చేయాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కోరారు. కాశిరెడ్డినాయన ఆశ్రమాన్ని దేవాదాయ శాఖలో విలీనం చేస్తానని మంత్రి అనడం చాలా దారుణమని, అలాంటివి జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి ఆర్‌సీడీఎస్ సంస్థ అధ్యక్షుడు

కార్యక్రమంలో ఆర్‌సీడీఎస్ యువజన విభాగపు అధ్యక్షుడు మారుతిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అర్జున్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత



చింతకొమ్మదిన్నె : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది



ఆర్టీపీపీలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఈ గౌరీపతి



పులివెందులలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్సీ, చైర్మన్, తదితరులు

పులివెందుల టౌన్ : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిలు తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక పూలంగళ్ల సర్కిల్ వద్ద మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. మానవత సంస్థ ద్వారా సారెడ్డి చంద్రశేఖరరెడ్డి ప్లాస్టిక్ నివారణకు గుడ్డ సంచులను అందించారు. అనంతరం అందరితో స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, అర్బన్ సీఐ నరసింహులు, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే లయోలా డిగ్రీ కళాశాలలో పర్యావరణ హాని గురించి ప్రిన్సిపాల్ జోజిరెడ్డి విద్యార్థులకు వివరించారు.

ఫుడ్అండ్‌సైన్స్ కళాశాలలో..

పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాలలో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ- పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించడం' అనే అంశం మీద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు డాక్టర్ జయమ్మ, డాక్టర్ నివేదిత మాట్లాడుతూ ప్రతినెల మూడవ శనివారం ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వలంటీర్లు కళాశాల ప్రధాన భవనం వెనుక భాగంలో ఉన్న ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించి చెత్త కుండీలలో వేశారు. కార్యక్రమంలో పి.డి డాక్టర్ రాజశేఖర్, కళాశాల ఎస్ఎస్ఎస్ విద్యార్థి వలంటీర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి దెబ్బ

ఎర్రగుంట్ల : ప్లాస్టిక్ వాడకం వల్ల కాలుష్యం అధికమై చాలా అనార్థాలు వస్తాయని ఎంపీడీఓ వెంకటరమణయ్య అన్నారు. శనివారం ఆయా సచివాలయాల వారీగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీని నిర్వహించి మాట్లాడారు. షాపుల యజమానులు ప్లాస్టిక్ కవర్లు బదులు కాటన్ కవర్లను వాడాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఆర్టీపీపీ సీఈ గౌరీపతి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఈలు, ఈఈలు ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కమలాపురం : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలో నగర పంచాయతీ కమిషనర్ పగడాల జగన్నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్, మెప్మా సిబ్బందితో పాటు వేదాస్ స్కూల్ విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పాచికలపాడు గ్రామంలో ఈఓపీఆర్‌డీ కెజియా ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర ప్రోగ్రాంను నిర్వహించారు. ఇంటింటికి తిరిగి పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డీఎల్‌పీఓ విజయభాస్కర్ హాజరైయ్యారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులచే పరిసర ప్రాంతాలను శుభ్రపరిచి ప్లాస్టిక్ సంచులను తొలగించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు సూచించారు. అలాగే పెండ్లిమర్రిలో ఎంపీడీవో జగన్‌మోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంపై ర్యాలీ చేపట్టారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : మున్సిపాలిటీ పరిధిలో ప్రజల సహకారంతో ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం అని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి పాతబస్టాండ్‌లోని గాంధీ సర్కిల్ వరకు అధికారులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఇక నుంచి పట్టణ పరిధిలో ప్లాస్టిక్ కవర్లను నిషేధించామన్నారు. వైస్ చైర్మన్ శింగరయ్య, డీఈ సురేంద్రబాబు, ఆర్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

లింగాల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం లింగాలలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు లింగాల బస్టాఫ్ విద్యార్థులచే మానవహారం నిర్వహించి స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

వేంపల్లె : పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. శనివారం ట్రిపుల్‌ఐటీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించేందుకు పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. దీంతోపాటు వీటిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జె.దీప్తి, అధికారులు కోటేశ్వరి, రమేష్, తిరుపతిరెడ్డి, అపర్ణ, కోనప్ప, విద్యా వలంటీర్లు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె గ్రామపంచాయతీ నందు శనివారం స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ ని నివారించి పర్యావరణ కాలుష్యము నివారించడానికి అవగాహన కార్యక్రమం మరియు షాప్ యజమానులతో ప్లాస్టిక్ కవర్లు బదులు కాటన్ సంచులు వాడకం గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కులాయిబాబు, ఈఓపిఆర్డి వెంకటసుబ్బారెడ్డి, స్థానిక సర్పంచ్,పంచాయతీ కార్యదర్శి మరియు హరిత రాయబారులు ,ఉపాధి హామీ సిబ్బంది, స్కూలు పిల్లలు, అంగన్వాడీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. అలాగే బుగ్గలపల్లి పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్రా ర్యాలీ, ప్రతిజ్ఞ మరియు ప్లాస్టిక్ వ్యర్థాలపై పిల్లలకు ఎంఈఓ రమాదేవి ఆధ్వర్యంలో అవగాహన కల్పించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపరాజు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి సునీల్ పాల్గొన్నారు.



కమలాపురంలో విద్యార్థులతో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి



పులివెందులలో కళాశాల ఆవరణలో చెత్తను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



జమ్మలమడుగులో ప్లాస్టిక్ నిషేధంపై ప్రమాణం చేస్తున్న అధికారులు



లింగాలలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



వేంపల్లె : పరిసరాలను శుభ్రపరుస్తున్న విద్యార్థులు

ఉపాధి పనుల పరిశీలన

చింతకొమ్మదిన్నె : గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ శనివారం మండలంలో జరుగుతున్న పంట కుంటలు, పండ్ల తోటల పెంపకం పనులను పరిశీలించారు. మొదటగా గ్రామపంచాయతీలోని రైతుల పొలంలో జరుగుతున్న పంట కుంట పనిని పరిశీలించారు. ఇందులో నీరు పంటకు ఉపయోగించుకోవచ్చు అని, కుంట పరిసర ప్రాంతాల్లో వివిధ రకాలైన మొక్కలు పెంచుకుని రైతులు లబ్ధి పొందాలని కోరారు. పథక సంచాలకులు ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ రైతులు వారి పొలాలలో పంట కుంటలు నిర్మించుకోవాలని, రైతులు ఒక రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా మొత్తం ఉపాధి హామీ నిధుల ద్వారా పంట కుంటలు చేపడతామని తెలిపారు. ఆ తరువాత అశ్వర్థుగారిపల్లె గ్రామస్తుడు సుబ్బరామిరెడ్డి పొలంలో జరుగుతున్న పంట కుంటను పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఉదయమే 6 గంటలకే వచ్చి మీకు ఇచ్చిన కొలతల మేరకు పని పూర్తి చేసుకుని 300 రూపాయలు కూలి పడేవిధంగా పని చేసుకోవాలని కూలీలను కోరారు. ఎంపీడీవో కుల్లాయిబాబు మాట్లాడుతూ మండలంలో 33 పంటకుంటలు మంజూరయ్యాయని పనులు మొదలు పెట్టామన్నారు. కార్యక్రమంలో కమలాపురం ఏపీడీ సోమశేఖరరెడ్డి, ఏపీఓ రామంజులరెడ్డి, ఈసీ అన్నా నాయక్, సాంకేతిక సహాయకులు మహబూబ్ అలీ, క్షేత్ర సహాయకులు కులాయమ్మ, రైతులు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



ఉపాధి పనుల వద్ద అధికారులతో చర్చిస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్

వైఎస్ విగ్రహం మార్పుకు ఏర్పాట్లు

జమ్మలమడుగు : పట్టణంలో కూరగాయాల మార్కెట్ సముదాయం వద్ద గతంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే మార్కెట్‌కు లిఫ్ట్ అమరుస్తున్న నేపథ్యంలో విగ్రహం అడ్డంగా ఉండటంతో మున్సిపాలిటీ అధికారులు ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శనివారం ఆయన కమిషనర్‌తో మాట్లాడారు. ఇప్పుడు ఉన్న స్థలం పక్కనే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ ఇన్‌చార్జి పొరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శింగరయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కమిషనర్‌తో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

విద్యార్థులకు నగదు బహుమతులు

వేముల : మండలంలోని మబ్బుచింతలపల్లె, భూమయ్యగారిపల్లె, రాచకుంటపల్లె, వేల్పుల, కె.కె.కొట్టాల గ్రామాల్లోని చదివే విద్యార్థులు 2022-23 విద్యా సంవత్సరంలో ప్రతిభ చూపిన 14 మంది విద్యార్థిని, విద్యార్థులకు నగదు బహుమతులను యూసీఐఎల్ జీఎం సుమన్ సర్కార్ శనివారం అందజేశారు. పదవ తరగతిలో ప్రతిభ కనబరిచి ఉన్నత విద్య చదివేందుకు నగదు పురస్కారాలను అందించామని ఆయన తెలిపారు. మొదటి ప్రతిభ కనబరిచిన విద్యార్థికి రూ.19,200లు, రెండవ ప్రతిభా పురస్కారం కింద రూ.16,800లను విద్యార్థులకు అందించామన్నారు. కార్యక్రమంలో డీజీఎం శ్రీకాంత్, పర్సనల్ మేనేజర్ ప్రదీప్ నాయక్, అడిషనల్ సూపరింటెండెంట్ రాజేష్, సీఎస్ఆర్ కో ఆర్డినేటర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలు మూసి వేయకుండా చర్యలు తీసుకుంటాం

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలోని ఏ ప్రభుత్వ పాఠశాలను మూసి వేయకుండా చర్యలు తీసుకుంటామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన జిల్లా విద్యాశాఖ అధికారి, ఏడు మండలాల విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ముందుకు సాగుతామన్నారు జిల్లా విద్యాశాఖ అధికారి సంసుద్దీన్, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న మెడికల్ కళాశాల వద్ద సుమారు రూ.19 లక్షలతో ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్లను ఎమ్మెల్సీ ప్రారంభించారు.



విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

చిత్ర లేఖనంలో విద్యార్థులు ప్రతిభ

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థులు చిత్ర లేఖనంలో ప్రతిభ చూపినట్లు హెచ్ఎం శివమునెమ్మ, డ్రాయింగ్ మాస్టర్ సురేష్ కుమార్‌లు తెలిపారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ప్లాస్టిక్, పరిశుభ్రతకు సంబంధించిన ఆయా అంశాలపై బొమ్మల రూపంలో విద్యార్థులు డ్రాయింగ్ వేశారు. దీంతో పలువురు విద్యార్థులను అభినందించారు.



డ్రాయింగ్ బొమ్మలను చూపుతున్న విద్యార్థులు

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ డి.నిహారిక క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులకు క్రమం తప్పుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు ఉంటాయన్నారు. నరాల, గుండె జబ్బులు, క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీకి సహకరించండి

ఎర్రగుంట్ల : మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా మార్చడానికి అందరు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పి.శేషఫణి కోరారు. శనివారం మున్సిపల్ పరిధిలోని జరిగిన పరిశుభ్రతపై ఆయన అవగాహన కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు.